
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 4 నవంబరు 2024



శివ శివయనరే..



● జిల్లాలో పలు శైవక్షేత్రాలు

● నేడు కార్తీకమాసం తొలి సోమవారం

● శివనామస్మరణతో మార్మోగనున్న శివాలయాలు



కడప కల్చరల్/ఖాజీపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భక్తవత్సలుడు, లయకారుడు అయిన శివుడికి కార్తీకమాసం అత్యంత ప్రీతికరమైనది. చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తున్నందున ఈ మాసానికి కార్తీక మాసమని పేరు. భక్తులు అభిషేక ప్రియుడిగా.. బోలాశంకరుడిగా పిలుచుకొనే పరమశివున్ని ప్రసన్నం చేసుకునేందుకు కార్తీకమాసంలో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కార్తీకమాసం శనివారంతో ప్రారంభమై, నెలలో నాలుగు సోమవారాలు వచ్చాయి. ఈ పర్వదినాన శివాలయాల్లో దీపారాధన చేస్తే పాపాలన్నీ తొలగిపోతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. తెలుగు సంప్రదాయం ప్రకారం కార్తీకమాసాన్ని ఎంతో పవిత్రంగా భావించి నెలంతా పూజలు, నోములు, వ్రతాలు, దీపారాధనలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో దైవారాధనలో ప్రజలు నిమగ్నమవుతారు. నేడు కార్తీకమాసం తొలి సోమవారం అయినందున శివనామస్మరణతో శివాలయాలు మారుమ్రోగనున్నాయి.

జిల్లాలో పలు శైవక్షేత్రాలు


సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు శైవాలయాలు శివనామస్మరణతో మారుమోగనున్నాయి. ఆ కోవలో పొలతల, నాగనాథేశ్వర కోన, నిత్యపూజకోన, పుష్పగిరి, వెయ్యినూతుల కోన తదితర అటవీ ప్రాంత సమీపాల్లో ఉన్న ఆలయాల సందర్శనకు సోమవారం భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆవు నెయ్యితో అత్యంత భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగిస్తారు.

నేడు శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు కడప ఆర్టీసీ రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా జిల్లాలోని శైవక్షేత్రాలతో పాటు శ్రీశైలం, మహానంది, యాగంటికి కూడా బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ఆ మేరకు ఈ నెల 4, 11, 18, 25 తేదీల్లో ప్రత్యేక బస్సులు బయల్దేరనున్నాయని, ఉదయం 5గంటలకు బయల్దేరి రాత్రి 10 గంటలకు తిరిగి రానున్నాయన్నారు. అందులో భాగంగా జిల్లాలో పుష్పగిరి, కన్యతీర్థం, యాగంటి, అల్లాడుపల్లె దేవాలయాలు, మహానందికి బస్సులు వెళ్లనున్నాయన్నారు. ప్రతి సోమవారం నిత్యపూజకోనకు, పొలతలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా కడప డిపో నుంచి శ్రీశైలానికి ఈ నెల 10, 17, 24 తేదీల్లో రాత్రి 10 గంటలకు బస్సులు బయల్దేరుతాయన్నారు. అదేవిధంగా కార్తీక మాసం పురస్కరించుకుని శబరిమలైకు వెళ్లే అయ్యప్పస్వామి భక్తుల కోసం అద్దెబస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బస్సులు కడప డిపో నుంచి శబరిమలైకి పర్మిట్‌ఛార్జి కేవలం రూ.500 మాత్రమే ఉంటుందన్నారు. వివరాలకు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు.



నిత్యపూజ కోన



ముస్తాబైన నాగనాథేశ్వర కోన


ఖాజీపేట మండల కేంద్రానికి సుమారు 7 కి.మీ. దూరంలో.. ఆహ్లాదకర వాతావరణంలో... ఎత్తైన కొండల మధ్య ఉన్న నాగనాథేశ్వర కోన మొదటి సోమవారం అయినందున ముస్తాబైంది. పుల్లూరు పంచాయతీలోని నాగనాథేశ్వరుని కొండపై శివుడు స్వయంభుగా వెలసి భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇక్కడి శివపార్వతులు కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తులు నమ్ముతారు. స్వామివారిని దర్శించుకునేందుకు వెళ్లే మెట్ల మార్గం నాగసర్పంలా ఉంటుంది. ఈ మెట్ల మార్గం కడప-కర్నూలు జాతీయ రహదారిలో వెళ్లే వాహనదారులకు ఎంతో చక్కగా కనిపిస్తూ ఉంటుంది.



నాగసర్పం ఆకారంలో నాగనాథేశ్వర ఆలయ మెట్ల మార్గం



కొండ పైభాగానికి వాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రహదారి



పుష్పగిరి

స్వామివారి కథ

నాగనాథేశ్వరుడు కొండ పైభాగంలో స్వయంభు లింగంగా నిలిచారని, స్వామివారికి ప్రత్యేక రూము ఏర్పాటు చేసి తలుపులు బిగించారని, అయితే స్వామివారు ఆగ్రహించి తలుపులను తన్నడంతో పుల్లూరు చెరువులో పడ్డాయని, అవి ఇప్పటికీ ఉన్నట్లు పూర్వీకులు చెబుతుంటారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు స్వామివారికి తలుపులు బిగించలేదు. కొండపై భాగంలో నేలమల్ల నుంచి లంకమలకు సొరంగ మార్గం ఉందని, అప్పట్లో ఈ మార్గాన దేవకన్యలు కార్తీకమాసంలో కార్తీక పౌర్ణమి రోజు కొండపై భాగాన ఉన్న కొలనులో స్నానమాచరించి శివుని దగ్గర నాట్యం చేసేవారని చెబుతుంటారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం కొండ కిందిభాగంలో కొలను ఏర్పాటు చేశారు. ఎంత లోతు తవ్వినా నీరు పడకపోవడంతో భార్యాభర్తలు ఇరువురు కోనేరులో నిద్రిస్తుండగా రోకలిపోటు వినపడిందని, ఇక నీరులేదని మనస్థాపం చెంది ఇరువురు ఆత్మహత్యకు పాల్పడినట్లు చెబుతారు. దీంతో వెంటనే కోనేరులో నీరు లభ్యమైందని అంటారు. ప్రస్తుతం ఆ కోనేరు పూర్తిగా శిథిలావస్థలో ఉంది.

కొండపైకి రోడ్డు మార్గం

గతంలో నాగసర్పంలా కొండపైకి భక్తులు మెట్లు ఏర్పాటు చేశారు. మెట్ల మార్గంలో ఓం నమః శివాయ అంటూ శివనామస్మరణతో అవలీలుగా మెట్లు ఎక్కేవారు. ప్రస్తుతం మెట్ల మార్గం ద్వారా వెళ్లలేని భక్తులు వాహనాల్లో కొండపైకి వెళ్లేందుకు దువ్వూరుకు చెందిన లక్ష్మిరెడ్డి రోడ్డు మార్గం ఏర్పాటు చేశారు.



పొలతల

అన్నదానం

కార్తీకమాసంలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు కొండ కింది భాగంలో భారీగా అన్నదానం నిర్వహిస్తుంటారు. మరి కొందరు నీటి సౌకర్యం కోసం వాటర్‌ప్యాకెట్లు పంపిణీ చేస్తుంటారు.

గట్టి బందోబస్తు

కార్తీకమాసంలో శివుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి ట్రాఫిక్‌కు అంతరాయాలు కలుగకుండా గట్టి బందోబస్తు చేపట్టనున్నట్లు సీఐ మోహన్ తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. అలాగే తమ వస్తువులు భద్రపరచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఎగ్జిబిషన్‌లో లక్కీడ్రా పేర టోకరా

● బంపర్ ఆఫర్లంటూ రూ.లక్షల వసూళ్లు

● 4 వేలకు పైగా టోకన్ల విక్రయం

● ఎవ్వరికీ తగలని లక్కీడ్రా

● నిర్వాహకులను నిలదీసిన బాధితులు

● పోలీసుస్టేషనుకు చేరిన పంచాయితీ

ప్రొద్దుటూరు, నవంబరు 3: ప్రొద్దుటూరులో దసరా సందర్భంగా ఏర్పాటైన ఎగ్జిబిషన్‌లో అక్షయ లక్కీడ్రా పేర నిర్వాహకులు జనానికి కుచ్చుటోపీ వేశారు. ఏకంగా ఎగ్జిబిషన్‌లో పోలీసు కంట్రోల్ రూము పక్కనే పెట్టి ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనాపాటి. పోలీసులు సైతం ఈ లక్కీ డ్రా స్కీంకు అనుమతులు వున్నాయా లేదా అని పరిశీలించకపోవడంతో ఇతని ఆటలు సాగాయి. ఇందులో ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ అమృతనగర్‌కు చెందిన ఓ టీడీపీ నేత కీలకంగా వున్నట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. కాగా ఆదివారం ఇందుకు సంబంధించి డ్రా తీయగా దాదాపు 300 మంది హాజరయ్యారు. ఎవరినీ విజేతగా ప్రకటించకపోవడం, పొంతన లేని సమాధానం చెబుతుండడంతో కుట్ర బట్టబయలైంది.

గతంలో దసరా సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలో ఇలాంటి లక్కీ డ్రా స్కీంలు విరివిగా ఏర్పాటు చేసేవారు. కానీ ఇలాంటి మోసాలు తరుచుగా జరుగుతుండటంతో పోలీసు అధికారులు వీటిని ఎక్కడా పట్టణంలో నిర్వహించకుండా కట్టడి చేశారు. కానీ తిరిగి ఇప్పుడు మళ్లీ ఎగ్జిబిషన్ వేదికగా ఈ లక్కీ డ్రా స్కీం తెరమీదకు వచ్చింది. ఎగ్జిబిషన్‌కు వచ్చిన ప్రజానీకం వద్ద టోకన్ రూ. వంద వసూళ్లు చేశారు. మొదటి బహుమతి మోటార్‌బైక్, రెండవ బహుమతి రిఫ్రిజిరేటర్, మూడవ బహుమతి వాషింగ్ మిషన్, మరో 25 మందికి కన్సొలేషన్ బహుమతులంటూ అక్షయ లక్కీ డ్రా వారు టోకన్ కార్డు మీదనే ప్రచారం చేసి పట్టణవాసులను ఆకట్టుకున్నారు.

4 వేలకు పైగా టోకన్ల విక్రయం

2 వేల మంది ఈ లక్కీ డ్రాలో పాల్గొంటారంటూ ఒక్కొక్కరి వద్ద టోకన్‌కు రూ.100 వసూలు చేశారు. లక్కీ డ్రాలో బహుమతులు అటు ఇటుగా కన్సొలేషన్‌తో కలిసి రూ.2 లక్షలు వుండవచ్చు. కానీ నిర్వాహకులు 4 వేలకు పైగా టోకన్లు ఎగ్జిబిషన్ బయట ఇతర ప్రాంతాల్లో కూడా విక్రయించినట్లు నిర్వాహకుడే చెబుతున్నాడు. అంతేకాకుండా టోకన్ కొన్న వారి పేరు, అడ్రస్, సెల్ నెంబర్ లాంటివి ఏవీ నమోదు చేసుకోకుండా టోకన్ ఇచ్చారు. ఇందులోనే మతలబు వుందని బాధితులు వాపోతున్నారు. నవంబరు 3న లక్కీ డ్రా తీస్తామని చెప్పి ఉదయం 11 గంటలకు లక్కీ డ్రా తీశారు. దాదాపు లక్కీ డ్రాకు 300 వందల మంది వరకు పలు టోకన్ నెంబర్ల వారు హాజరయ్యారు. కానీ లక్కీ డ్రాకు వచ్చిన ఎవ్వరికి ఏ ఒక్క బహుమతి తగలలేదు. దీంతో బాధితులు తాము మోస పోయామని భావించి నిర్వాహకున్ని ప్రశ్నించారు. నిర్వాహకుడు డొంకతిరుగుడు సమాధానాలు ఇచ్చి తప్పించుకునే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. అసలు ఏ నెంబర్లకు తగిలాయో కూడా నిర్వాహకుడు వెల్లడించడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డికి బాధితులు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎటువంటి విచారణ చేపట్టలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో బాధితులే నిర్వాహకుడితో వాగ్వాదానికి దిగి లక్కీడ్రాలో తమ టోకన్ నెంబర్లు వున్నాయో లేదో వెతుక్కునే పని చేపట్టారు.

ఈ విషయంపై అర్బన్ సీఐ గోవిందరెడ్డిని వివరణ కోరగా.. అక్షయ లక్కీ డ్రా స్కీంలోని బాధితులు ఫిర్యాదు చేసేందుకు తన వద్దకు వచ్చారని, అయితే వారి టోకన్ నెంబర్లు లక్కీ డ్రాలో వున్నాయో లేదో పరిశీలించి తర్వాత ఫిర్యాదు చేయమని చెప్పానన్నారు. కాగా రాత్రి సమయంలో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు



నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న బాధితుడు



ఎగ్జిబిషన్‌లో పోలీసు కంట్రోల్ రూమ్ పక్కనే లక్కీడ్రా కార్యాలయం వద్ద గుమికూడిన బాధితులు

జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడతా

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



కడప, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్ష మేరకు కడప జిల్లాను సమగ్రాభివృద్ధి చేసి రాష్ట్రంలోనే గుర్తింపు తీసుకొస్తానని కొత్తగా బాధ్యతలు చేపట్టనున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆంధ్రజ్యోతికి వివరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఈయన రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆదివారం ఈయనను కడప కలెక్టర్‌గా నియమించింది. ఇక్కడ పనిచేసిన లోతేటి శివశంకర్‌ను కేంద్రం తెలంగాణకు బదిలీ చేసింది. ఏపీకి వచ్చేందుకు శివశంకర్ క్యాట్, హైకోర్టును ఆశ్రయించారు. తీర్పు వ్యతిరేకంగా వచ్చింది. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు శ్రీధర్‌ను నియమించింది. పరిశ్రమలశాఖలో పనిచేసిన ఈయన కడపకు రావడంతో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఇకపై అనుమతులు వేగవంతంగా వచ్చే అవకాశం ఉంది. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్ కడప జిల్లాపై ప్రత్యేక దృష్టిపెట్టారు. జిల్లాలో జరిగిన నారాలోకేశ్ పాదయాత్రలో కడప జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా, హార్టికల్చర్ హబ్‌గా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శ్రీధర్ కలెక్టర్‌గా రావడంతో ప్రభుత్వ లక్ష్యానికి న్యాయం జరిగే అవకాశం ఉంది. కడప జిల్లా సమగ్రాభివృద్ధికి మౌలిక వసతులు, పరిశ్రమలు ఏర్పాటుకు, భూకబ్జాలు తదితర సమస్యలు లేకుండా చేస్తానని కలెక్టర్ తెలిపారు. బుధవారం ఈయన బాధ్యతలు చేపట్టనున్నారు.

సర్దుబాటు పేరుతో కరెంటు బిల్లుల బాదుడు

● ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆగ్రహం



ప్రొద్దుటూరుటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయిదు నెలల పాలనలో సర్దుబాటు పేరుతో ప్రజలపై కరెంటు బిల్లుల భారం మోపుతోందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో ప్రభుత్వం ప్రజలపై రూ.6,073 కోట్లు కరెంటు బిల్లుల భారం మోపిందని, మరోసారి సర్దుబాటు కోసం రూ.11,826 కోట్ల భారం మోపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విద్యుత్తు ద్వారానే ప్రజలపై రూ.18 వేల కోట్ల భారం మోపడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. సంవత్సరానికి ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం పాక్షికంగానే అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.54 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా కోటి కుటుంబాలకే ఉచిత గ్యాస్ అందిస్తున్నారని, మిగతా కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సూపర్-6 పథకాల హామీతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. సూపర్-6లో ఇచ్చిన హామీలు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, అన్నదాన సుఖీభవ పథకాలను ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేసి విద్యుత్తు సర్దుబాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజర్, పట్టణాధ్యక్షుడు జిలానీబాష, తదితరులు పాల్గొన్నారు.

పార్నపల్లె టు బెంగళూరు..

● యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ఇసుక అక్రమ రవాణాకు పులివెందుల రాజమార్గంలా మారింది. రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజాము వరకు యంత్రాలతో లారీల్లో ఇసుక నింపి పార్నపల్లె మీదుగా బెంగళూరుకు రవాణా సాగిస్తున్నారు. చిత్రావతి నదినుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. టీడీపీ నాయకుల అండతోనే ఈ రవాణా సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. టీడీపీ అధినాయకత్వం ప్రజల కోసం ఉచితంగా ఇసుక ఇచ్చేందుకు కంకణం కట్టుకుంది. కానీ కొందరు కిందిస్థాయి నాయకుల కారణంగా ఉచిత ఇసుక కాస్త అక్రమార్కులకు వరంలా మారింది. రాత్రయితే చాలు.. రోజూ సుమారు 30 లారీల్లో ఇసుక అక్రమంగా సరిహద్దులు దాటిపోతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు వీటిని అడ్డుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

కడప, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలోనే ఈ నియోజకవర్గం వైసీపీ నేతల తీరుతో అక్రమాలకు పెట్టింది పేరుగా మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక.. టీడీపీ నేతలు కొంతమంది వైసీపీ సంప్రదాయాన్నే కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే ఇసుక అక్రమ రవాణా. పులివెందుల నియోకవర్గం లింగాల మండలంలోని పార్నపల్లె వద్ద నున్న చిత్రావతి నది నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. యంత్రాల సాయంతో ఇసుకను లారీలకు నింపి రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజాము వరకు తరలిస్తున్నారు. మరోపక్క టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రజల అవసరాల కోసం ఉచిత ఇసుకను అందిస్తోంది. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అక్రమంగా ఇసుక తరలిపోకుండా స్థానికులే అడ్డుకోండని ప్రకటన కూడా చేశారు. కానీ పులివెందులలో మాత్రం ముఖ్యమంత్రి మాటలను తెలుగు తమ్ముళ్లు గడ్డిపోచలా భావించి తమ అక్రమాలు సాగిస్తున్నారు. ప్రతిరోజు 25 నుంచి 35లారీల వరకు ఇసుక అక్రమంగా తరలించి కోట్లు దండుకుంటున్నారు.

బెంగళూరులో భలే గిరాకీ

పక్క రాష్ట్రమైన కర్ణాటక రాజధాని బెంగళూరులో ఇసుకకు ఎక్కువ డిమాండ్ ఉంది. అక్కడ సాగుతున్న వివిధ నిర్మాణాలకు ఇసుక కొరత తీవ్రంగా ఉంటుంది. దీంతో అక్కడ ఒక లారీ ఇసుక రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు పలుకుతుందని అంటున్నారు. ప్రతిరోజు ముందస్తు సమాచారం మేరకు పార్నపల్లె వద్ద నుంచి బెంగళూరుకు ఇసుక లారీలు వెళ్తాయి. బెంగళూరు శివారుల్లోనే డబ్బు చెల్లించి వారికి అవసరమైన చోట ఇసుకను అన్‌లోడ్ చేసుకుంటారు. ఈ రోజు రాత్రి ఇసుకతో వెళ్లిన లారీ మరుసటి రోజు రాత్రి చిత్రావతి నదికి తిరిగి వచ్చి మళ్లీ ఇసుక తీసుకెళ్లేంత వెసులుబాటు ఉంది. ఇలా 25 నుంచి 30 లారీలు రోజూ వెళతాయి. ఈ లెక్క ప్రకారం రోజుకు దాదాపు రూ.50లక్షల నుంచి రూ.70లక్షల వరకు ఇసుక అక్రమ రవాణా ద్వారా ఆదాయం గడిస్తున్నారు. ఇసుక తరలించడం అన్నిటికంటే చాలా సులువు అని ఆ నాయకులు బహిరంగంగానే అంటున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

పులివెందుల ప్రాంతంలో సాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు పలు శాఖల అధికారులు వంతపాడుతున్నట్లు తెలిసింది. పోలీసులు, రెవెన్యూ, విజిలెన్స్ తదితర అధికారులు ఇసుక అక్రమ రవాణాకు రాజమార్గం రూపొందించినట్లు తెలిసింది. రాత్రి 10గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఇసుకతో ఏ లారీ వచ్చినా అడ్డుకోకుండా వెళ్లేందుకు అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. రోజు మామూళ్లు, నెల మామూళ్లు అంటూ వారికి కూడా ముడుపులు అందుతున్నాయని అంటున్నారు. పులివెందుల ప్రాంత టీడీపీ నాయకులు ఇంత బహిరంగంగా ఇసుక అక్రమంగా తరలిస్తుంటే.. ఇదేమని అడిగే వారే లేరు.

రెండు జిల్లాల మధ్య నుంచి..


అటు అనంతపురం ఇటు కడప.. రెండు జిల్లాల మధ్య చిత్రావతి నది ఉంది. ఇదే అక్రమార్కులకు వరంలా మారింది. ఇసుక అక్రమ రవాణాపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే అది మన జిల్లా కాదని కడప జిల్లా అధికారులు.. అది మన జిల్లా కాదని అనంతపురం అధికారులు.. ఇలా రెండు వైపుల చేతులెత్తేస్తున్నారు. ఇది అక్రమార్కులకు కలిసొస్తోంది. కడప జిల్లా బార్డర్‌లో ఉన్న అధికారులతో అనంతపురం జిల్లా పరిధిలోని ఇసుక తరలించుకుంటామని మీరు చూసీ చూడనట్లు వ్యవహరించాలని అందుకు మీకు కొంతమొత్తం ముట్టజెపుతామని వారికి చెప్పడం.. ఈ తరహాలోనే అనంతపురం జిల్లాలోని అధికారులకు కడప జిల్లా పరిధిలోని ఇసుక తవ్వుకుంటామని మీకు పదో పాతికో ఇస్తామని చెప్పడం ఇలా ఇద్దరు అధికారులకు ముడుపులు ఇస్తూ ఇసుక అక్రమ రవాణా పెద్ద ఎత్తున సాగిస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని పులివెందుల నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



● రాత్రి 10 నుంచి తెల్లవారుజాము వరకు లారీల్లో ఇసుక లోడింగ్

● రోజూ 25 నుంచి 30 లారీలలో తరలింపు

● మామూళ్ల మత్తులో అధికారులు



వేరు'శని'గ

● ఖర్చు ఎక్కువ, దిగుబడి తక్కువ ● తీవ్ర వర్షాభావంతో దెబ్బతిన్న వేరుశనగ
● అప్పుల పాలైన రైతులు ● ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు

గాలివీడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు ప్రధాన ఆదాయ వనరు వేరుశనగ. ఒకప్పుడు రైతు రారాజుగా పేరు పొందిన వేరుశనగ నేడు అదే రైతుకు శాపంగా మారుతోంది. లక్షలు ఖర్చు చేసి సాగు చేసిన పంట తీవ్ర వర్షాభావం వల్ల రైతులను భిక్షాధికారిగా మారుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నీటి వనరులు ఉన్న ఏరియాల్లో పంట ఏపుగా పెరిగినప్పటికీ దిగుబడి మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. అయితే ఎక్కువ భాగం వర్షం లేకపోవడం వల్ల దిగుబడి తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేసేదేమీ లేక ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మండలంలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. మండలంలో మొత్తం 30 వేల ఎకరాల వ్యవసాయ భూమి కలదు. ఇందులో 15 వేల ఎకరాలకుపైగా వేరుశనగ సాగు భూమి ఉన్నది. మిగతా భూమిలో వరి, సజ్జ, రాగితో పాటు మామిడి తోటలు, కూరగాయల తోటలను సాగు చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా రైతులు వేరుశనగ సాగు చేస్తూ రావడం ఆనవాయితీ. ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులు, వాతావరణం (నేల స్వభావం) వేరుశనగ సాగుకు అనుకూలం. అందువల్ల అత్యధిక జనాభా వేరుశనగను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత పది సంవత్సరాల క్రితం ప్రతి పల్లెలో ప్రతి ఇంటిలో ఇంటి నిండా వేరుశనగ కాయలు ఉండేవి. ఆ కాలంలో వేరుశనగ ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులతో పాటు వివిధ పట్టణ ప్రాంతాల్లో రైతులు గృహాలు, స్థలాలను కూడా కొనుగోలు చేశారు. కానీ రాను రాను వాతావరణంలో మార్పులతో పాటు సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల వేరుశనగను సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. నష్టాలు వస్తున్నప్పటికీ వేరుశనగపైన మక్కువతో సాగు విస్తీర్ణం మాత్రం తగ్గించలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని 14 పంచాయతీల్లో దాదాపు 10 వేల ఎకరాల వరకు వేరుశనగను సాగు చేశారు. ఇందులో నూలివీడు, సీసీపల్లె, పూలుకుంట, బోరెడ్డిగారిపల్లె, పందికుంట, తలముడిపి, కొర్లకుంట, గరుగుపల్లె, గుండ్లచెరువు, పేరంపల్లె, గోపనపల్లె, ఎగువ గొట్టివీడు, గోరాన్‌చెరువు, అరవీడు, గాలివీడు పంచాయతీల్లో వేరుశనగను అధిక విస్తీర్ణంలో సాగు చేయగా వెలిగల్లు, తూముకుంట పంచాయతీల్లో కొంత మేర సాగు చేశారు. ఈ ప్రాంతంలోని నేల స్వభావాన్ని బట్టి నారాయణిరకం, లేపాక్షి, తిరుపతి, ట్యాగ్ 26, వశిష్ట, ఎర్రకాయలు వంటివి సాగు చేశారు.

ఖర్చు ఎక్కువ.. దిగుబడి తక్కువ...

ప్రస్తుతం వేరుశనగ సాగుకు ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని, కానీ ఆదాయం మాత్రం రావడం లేదని రైతులు పేర్కొన్నారు. ఒక ఎకరా భూమిలో వేరుశనగను సాగు చేయడానికి 20 వేల రూపాయలకు పైబడి ఖర్చు అవుతోందని, ఇందులో విత్తనకాయలు 42 కేజీల బస్తా 3 వేలకు పైబడి ధర పెట్టి కొనుగోలు చేస్తున్నామని, దుక్కులు, ఎరువులు, కూలి, మందులు, కాయలను వలచడం వంటివి రేటు అధికమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం గింజలు భూమిలో వేసిన నాటి నుంచి వేరుశనగను తొలగించే వరకు అనేక రకాల తెగుళ్లు సోకుతున్నాయని పేర్కొన్నారు. గతంలో పంట సాగు కాలం అంతా కలిపిన ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే తెగుళ్లకు పిచికారీ చేసేవాళ్లమని కానీ నేడు నెలకు రెండు సార్లు తెగుళ్లకు పిచికారీ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒకపక్క తెగుళ్లు, మరొకపక్క తీవ్ర వర్షాభావం వల్ల పంట దిగుబడి తగ్గిపోయిందన్నారు. గతంలో ఒక ఎకరాకు 15 నుంచి 25 బస్తాలు వేరుశనగ దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది వర్షాలు లేకపోవడం వల్ల ఒక ఎకరాకు 5 నుంచి 6 బస్తాలు దిగుబడి వస్తున్నాయన్నారు. వ్యవసాయాధికారులు నిర్వహించిన పంట కోత ప్రయోగం నమోదు కూడా ఒక ఎకరాకు 5 నుంచి 6 బస్తాలు దిగుబడి వచ్చినట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. పండిన కాయలకు కూడా గిట్టుబాటు ధరలేదని రైతులు పేర్కొన్నారు. ఒక ఎకరాకు 3 వేలకుపైబడి పెట్టి కొనుగోలు చేయగా రైతులు పండించిన పంటలకు మాత్రం 2 వేల రూపాయలు కూడా ధర పలకడం లేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఒక ఎకరా వేరుశనగను సాగు చేయడం వల్ల 15 వేల వరకు నష్టం వచ్చిందని, ఇలా అయితే చేసిన అప్పులు తీర్చడం కోసం ఉన్న భూములను కూడా అమ్మాలని మరికొంత మంది రైతులు తెలిపారు. మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వేరుశనగను సాగు చేసిన రైతులు లక్షల్లో నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధిక మొత్తంలో నష్టపరిహారాన్ని రైతులకు అందించి ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు.



గాలివీడులో ఎండిపోయిన వేరుశనగ





నూలివీడులో పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారులు

15 వేలకు పైబడి నష్టపరిహారం అందించాలి



మా కుటుంబం 5 ఎకరాల్లో వేరుశనగను సాగు చేశాము. ఒక ఎకరా వేరుశనగ సాగు చేయడానికి 20 వేలకు పైబడి ఖర్చు అయింది. దిగుబడి మాత్రం 5 బస్తాలు అయినవి. వర్షాలు లేకపోవడం వలన పంట దిగుబడి తగ్గిపోవడమే కాక కాయల నాణ్యత కూడా తగ్గిపోయింది. తద్వారా ఒక బస్తా ధర 2 వేల రూపాయలకు అమ్మాను. నాకు ఒక ఎకరాకు 10 వేలకు పైబడి నష్టం వచ్చింది. మొత్తం 5 ఎకరాలకు 60 వేలకు పైబడి నష్టపోయాము. కావున ప్రభుత్వం స్పందించి ఒక ఎకరాకు 15 వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- ఆదినారాయణ, వడ్డెపల్లె, చీమలచెరువుపల్లె

ఉపాధిని అనుసంధానం చేయాలి



ప్రస్తుతం వేరుశనగతో పాటు ఇతర పంటల సాగుకు దిగుబడి కన్నా ఖర్చు ఎక్కువ అవుతున్నది. పంట సాగుకు విత్తనాలు, ఎరువులతో పాటు కూలి రేట్లు అధికంగా ఉన్నాయి. పంటల మీద మక్కువతో అప్పులు చేసి సాగు చేస్తున్నాము. కానీ పంటలు దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాము. కావున ఎన్‌ఆర్‌ఐఈజీఎస్ పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేస్తే రైతులకు కొంత మేర ఊరట లభిస్తుంది. తద్వారా నష్టాలను కూడా తగ్గించిన వారవుతారు.

- జనార్ధన్, కొండ్రెడ్డిగారిపల్లె, నూలివీడు

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

● అధికారులకు మంత్రి మండిపల్లి ఆదేశం



ప్రజా దర్బారులో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌లో అందిన వినతులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో సమస్యలు పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమ స్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజాదర్బార్‌లో అందిన అర్జీలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

తిప్పనకొండలో భూమి అన్యాక్రాంతం

● పట్టించుకోని రెవెన్యూ శాఖ ● కొండను తవ్వి భూమి చదును చేసిన వైనం



శాఖరాజుపల్లి సర్వేనంబరు 175లో కొండను తవ్వేసిన ప్రాంతం



డీకేటీ పొలంలో ఎక్సకవేటర్, ట్రాక్టర్

సిద్దవటం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాఖరాజుపల్లి రెవెన్యూ తిప్పనకొండ సర్వేనంబరు 175లో ఒక ఎకరా స్థలం కొండ ప్రాంతంలో కొండలు తవ్వి భూమి చదును చేశారు. బహిరంగంగా కనిపిస్తున్నా అటువైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదని పలు విమర్శలు వస్తున్నాయి. కొంతమంది తనకున్న డీకేటీ పొలంలో మరికొంత ప్రభుత్వ డీకేటీ రెవెన్యూ పొలాలు అన్యాక్రాంతం చేసినా రెవెన్యూ సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు కొంతమంది ఆరోపిస్తున్నారు. మండల పరిధిలో జరిగిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో కొంతమంది రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా అవి ఏ మాత్రం అమలు కాలేదని, కొంతమంది బడా నేతలు ఇవన్నీ బయటకు రాకుండా రెవెన్యూ సిబ్బందితో మిలాఖత్ అయినట్లు ఆరోపణలు బలంగా వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల పని దినాలు, సెలవు రోజుల్లో కొంతమంది డీకేటీ రెవెన్యూ పొలంలో ఎక్సకవేటర్లు పెట్టి పనులు చేస్తున్నా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోవడం లేదని మండల పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

దీనిపై వీఆర్వో శివశంకర్‌ను వివరణ కోరగా.. సర్వే నెంబరు 175లో గ్రావెల్ తవ్వకాలు జరిపి భూమి చదును చేసిన విషయంపై పరిశీలిస్తానని, విధి నిర్వహణలో భాగంగా నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని, రికార్డులు అన్నీ పరిశీలించి ఇలాంటి సంఘటనలు జరగకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ బడులను బతికించుకుందాం

● మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణం

మదనపల్లెఅర్బన్, నవంబరు 3:(ఆంధ్రజ్యోతి) పాలకుల విధానాల వల్ల ప్రభుత్వ బడులు నిర్వీర్యం అవుతున్నాయని, వీటిని కాపాడుకొనేందుకు యూటీఎఫ్ నిరంతరం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ, మాజీ ప్రొటెం చైర్మన్ విఠపు బాలసుబ్రహ్మణం పిలుపునిచ్చారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా పేద ప్రజల పిల్లలకు చదువులు దూరం అవుతాన్నాయని అభిప్రాయపడ్డారు. ఒక ఉపాధ్యాయ సంఘం లక్ష సభ్యత్వాలతో రాష్ట్రంలో బలమైన సంఘంగా ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. అదే ఒరవడితో నిజాయితీ, నిబ్ధతతో కార్యకర్తలు కొనసాగి ఉద్యమించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రయోజనాలకు పనిచేస్తున్నాయే తప్ప ఉపాధ్యాయుల ప్రయోజనాలకు పనిచేయడం లేదని వాపోయారు. వేల కోట్ల బకాయిలు ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని, 13వ పీఆర్సీ ఊసేలేదని, నెలవారి ప్రమోషన్ పక్కన పెట్టారని త్వరలో ఉద్యమ కార్యాచరణ ద్వారా వీటన్నింటినీ సాధించి తీరుతామన్నారు. పూర్వ కార్యదర్శి బాబురెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఏర్పడిన అసంబద్ధతను తొలగించాలన్నారు. వెంటనే ప్రయోషన్లు ఇవ్వాలని, స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ ప్రయోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీరాజు, శ్రీనివాసులురెడ్డి, యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జాబీర్, సహాధ్యక్షుడు హేమలత, శివారెడ్డి, ట్రేజరర్ చంద్రశేఖర్ జిల్లా నాయకులు వెంకటరమణ, సురేంద్ర రెడ్డి, రమణమూర్తి, ఆదినారాయణ, భాస్కర్ రెడ్డి, సుధాకర్, అక్రంబాషా, దావుద్దీన్, శ్రీనివాసులు, అంజాద్, వెంకటయ్య, హరికృష్ణ, శ్రీనప్ప, యూసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

● ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు

రాయచోటిటౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 11న భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తవ్వకం ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం మానుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైములకు నిధులు మంజూరు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు నుంచి గతంలో దారి మళ్లించిన నిధులను బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, కోటి రూపాయలు బోర్డులో జమ చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కోశాధికారి హుస్సేన్, నరసింహులు, రమణయ్య, బాలకృష్ణ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



ఇద్దరు కుమారులతో అదృశ్యమైన ధనుశ్రీ

మదనపల్లె అర్బన్, నవంబరు 3: ఇద్దరి పిల్లలతో కలిసి మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె తాలుకా సీఐ రామచంద్ర తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణానికి చెందిన ధనుశ్రీ (32), ఇద్దరు కుమారులు డి.పార్థివ్ (10) డి.ధనుష్(8) కలిసి నవంబరు ఒకటో తేది నుంచి కనపడకుండా పోయారు. 11 ఏళ్ల క్రితం తంబళ్లపల్లెకు చెందిన ధనుశ్రీతో పీలేరు టౌన్ ఇందిర్మకాలనీకి చెందిన దేవర భార్గవ్‌కు వివాహమైంది. ధనుశ్రీ కూలీ పనులకు వెళుతుండగా, భార్గవ్ సెంట్రింగ్ పనులకు వెళుతుండేవాడు. రెండు నెలలు క్రితం వారు తమ పిల్లలతో కలిసి మదనపల్లె పట్టణం మాయాబజార్, వివేకానంద మున్సిపల్ స్కూల్ వెనుకవైపు కాపురం ఉంటున్నారు. రెండు రోజులుగా కనపడకపోవడంతో బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ధనుశ్రీ తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు ఆదివారం విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'పల్లె పండుగ' టార్గెట్ ఇదే!

● సంక్రాంతి నాటికి కొత్త వెలుగులు
● మండలానికి రూ.4.32 కోట్ల నిధులు
● 48 అభివృద్ధి పనులతో కళకళ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. గత ప్రభుత్వం తప్పిదాలను సరిచేస్తూ గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తోంది కూటమి ప్రభుత్వం. సంక్రాంతి నాటికి వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేసేలా పల్లె పండుగ వారోత్సవాలను చేపట్టింది. పల్లె పండుగతో గ్రామాల్లో కొత్త వెలుగులు తేనున్నాయి. ప్రొద్దుటూరు మండల పరిధిలో రూ.4.32 కోట్ల వ్యయంతో వివిధ రకాల 48 అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. సంక్రాంతి నాటికి గ్రామాల్లో పనులు పూర్తయి కొత్త వెలుగులు చిమ్మనున్నాయి.

● గత ప్రభుత్వ హయాంలో కనీసం పల్లెల్లో రోడ్లు లేక చెరువుల్లో పూడికలు తీసే దిక్కులేక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇక రోడ్లకోసం కేటాయించిన నిధులు, పంచాయతీరాజ్‌కు రావాల్సిన కేంద్ర ప్రభుత్వ సొమ్మును గత ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లించడంతో గ్రామాలు కళ కోల్పోయాయి. ఆ తప్పిదాలను సరిదిద్దుతూ గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముందుకు సాగాలనే కాన్సెప్ట్‌తో ప్రారంభమైందే ఈ పల్లె పండుగ. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అధికారుల సమన్వయంతో ఇప్పటికే అన్ని పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు పూర్తయి లక్ష్యసాధన దిశలో ముందుకు సాగుతున్నది.


● ప్రొద్దుటూరు మండల పరిధిలో రూ.4.32 లక్షల వ్యయంతో 45 సీసీ రోడ్లు, ఒక మెటల్ రోడ్డు, రెండు కాంపౌండ్‌వాళ్ల పనులను మంజూరయ్యాయని పంచాయతీరాజ్ డీఈ లక్ష్మీ నారాయణరెడ్డి తెలిపారు. చెన్నంరాజుపల్లె పంచాయతీకి రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, కామనూరు పంచాయతీకి 74.2 లక్షలతో సీసీ రోడ్డు, పాఠశాల కాంపౌండ్ వాల్ మంజూరైనట్లు తెలిపారు.

రూ.34.2 లక్షల వ్యయంతో దొరసానిపల్లె పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.22 లక్షల వ్యయంతో ఉప్పరపల్లె పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.10 లక్షల వ్యయంతో కల్లూరు పంచాయతీలో సీసీ రోడ్లు, రూ.30 లక్షల వ్యయంతో తాళ్లమాపురం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు వేయనున్నారు. నంగనూరుపల్లె పంచాయతీకి రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, సీతంపల్లె పంచాయతీకి రూ.35 లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణ పనులు, చౌడూరు పంచాయతీకి రూ.15 లక్షలతో సిమెంటు రోడ్డు పనులు, చౌటపల్లె పంచాయతీలో రూ.65 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు, మెటల్ రోడ్డు మంజూరైనట్లు చెప్పారు. పెద్దశెట్టిపల్లె పంచాయతీలో రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, శంకరాపురం గ్రామ పాఠశాలలో కాంపౌండ్ వాల్, రూ.38 లక్షల వ్యయంతో గోపవరం పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, రూ.15 లక్షల వ్యయంతో కొత్తపల్లె పంచాయతీ పరిధిలో సిమెంటు రోడ్లు, రూ.27 లక్షల వ్యయంతో సోములవారిపల్లె పంచాయతీ పరిధిలో సిమెంటు రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయని తెలిపారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద ఈ పల్లె పండుగ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 45 సిమెంటు రోడ్లు, ఒక మెటల్ రోడ్డు, రెండు పాఠశాలలకు రెండు కాంపౌండ్‌వాళ్లు అందుబాటులోకి రానున్నాయి.



అపరిశుభ్రత, గుంతల నుంచి మహర్దశ పట్టనున్న రోడ్లు


గ్రామాలకు కొత్త వెలుగు



పల్లె పండుగతో గ్రామాలు కొత్త వెలుగులతో కళకళలాడనున్నాయి. మండల పరిధిలో 48 పనులు మంజూరయ్యాయి. ఏడాది చివరి డిసెంబరు నాటికి పనులను పూర్తి చేసి సంక్రాంతికి ప్రారంభోత్సవాలు చేయనున్నాం. ఆదిశగా చర్యలు తీసుకుంటున్నాం.

- సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో

త్వరితగతిన పూర్తి చేస్తాం



మండల పరిధిలోని గ్రామ గ్రామానికి తిరిగి మంజూరైన పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చేస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, అందరి సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. లక్ష్యానికంటే ముందుగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- డి.లక్ష్మీనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ

సంతానలక్ష్మీకి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృ తాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యకు పునరుజ్జీవం

- 117 జీవో రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం
- జిల్లాలో పాఠశాలలకు ఎంతో ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు



కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ తప్పిదంతో గాడి తప్పిన ప్రాథమిక విద్యా వ్యవ స్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తొలి అడుగులు వేసింది. అనాలోచితంగా వైసీపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీవో 117ను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్ర బాబు ప్రకటించారు. దీనిపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ప్రాథమిక విద్య 1 నుంచి 5 తరగతుల వరకు ప్రతి పల్లెలో, 3 కిమీ పరిధిలో ప్రాథమికోన్నత, ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు అనతి కాలం నుంచి నడుస్తున్నాయి. కానీ విద్యాసంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నెం.117తో ప్రాథమి విద్య నిట్టనిలువునా చీలి పోయింది. విద్యాకమిషన్ లేకుండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా సబ్జెక్టు నిపుణుల బోధన ఉండాలని, ఆంగ్లవిద్యను బలోపేతం చేయాలని విలీన విధానాన్ని తీసుకువచ్చారు. కిలోమీటరు పరిధి ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5 తరగతులు విలీనం చేశారు. అక్కడ నుంచే ప్రాథమిక విద్య విచ్ఛిన్నానికి దారి తీసింది. ఈ ప్రక్రియను నిరసిస్తూ పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులు ధర్నాలు, నిరసనలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక తమ పిల్లలను ప్రభు త్వ పాఠశాలల నుంచి దారి మళ్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రజాప్రతినిధుల పలుకుబడితో కొన్నిచోట్ల మాత్రం విలీనం ఆపగలి గారే తప్ప ప్రతి చోటా అమలులోకి వచ్చింది. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్కూలు అసిస్టెంటు స్థాయి ఉపాధ్యాయులు బోధించడంతో విద్యా లక్ష్యాలు ఆశించిన స్థాయిలో సాధించలేకపోవడం గమనార్హం. దీంతో తమ గ్రామం నుంచి వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో అధిక శాతం మంది విద్యార్థులు డ్రాపవుట్లుగా మారారు. క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. చివరికి ప్రాథమిక విద్య విద్యార్థుల్లో సాధించాల్సిన లక్ష్యాలు సాధించకపోవడంతో పాటు తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపడంతో ప్రభుత్వపాఠశాలల్లో ప్రాథమిక విద్యా ర్థుల సంఖ్య తగ్గిపోయింది.

450 పాఠశాలలు విలీనం

తగిన కార్యాచరణ లేకుండా, పర్యవసనాలు ఆలోచించ కుండా గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవోతో ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్వీర్యమైంది. 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన చేయిస్తామని 3, 4, 5 తరగతులను కిలోమీటరు దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీ నం చేసింది. ఈ నిర్ణయం విపరీత పరిణామాలకు దారి తీస్తుందని ఉపాధ్యాయ సంఘాలు ఎంత చెప్పినా గత వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. చివరికి ప్రాథమిక బడుల ఉనికికే ముప్పు తెచ్చింది. జీవో అమలులో భాగంగా జిల్లాలో 450 ప్రాథమిక పాఠశాల ల్లోని 3, 4, 5 తరగతుల పిల్లలను 313 ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. అలాగే 407 ప్రాథమిక పాఠశాలలను 275 ఉన్నతపాఠశాలల్లో విలీనం చేయగా 40 ప్రాథమిక పాఠశాలలు 35 ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు 3 ఉన్నతపాఠశాలల్లోనూ.. మొత్తం 450 పాఠశా లలు 313 ఉన్నతపాఠశాలల్లో విలీనం చేశా రు. ఈ క్రమంలో పలు సమ స్యలు ఉత్పన్నం అయ్యాయి. నిబంధనల ప్రకారం ప్రతి తరగతికి ఒక గది ఉండాలి. ప్రతి సబ్జెక్టుకు ఒక టీచరు ఉండాలి. ఈ దిశగా చర్యలు తీసుకోకపో వడంతో గదులు లేక చాలా చోట్ల వరండాల్లో పిల్లలను కూర్చోబెట్టారు. కొన్ని చోట్ల ఒకే గదిలో రెండేసి తరగతులు కూడా నిర్వహించారు. 2022లో విలీనం ఏర్పడితే 2023 విద్యాసంవత్సరం చివరిలో పదోన్నతులు కల్పి ంచి ఉపాధ్యా యులను సర్దుబాటు చేశారు. ఈ విధంగా ఒక బ్యాచ్ విద్యార్థులకు సరైన బోధన లభించలేదని చెప్పవచ్చు.

647 ఏకోపాధ్యాయ పాఠశాలలు

ఈ జీవోతో తలెత్తిన మరో ప్రధాన సమస్య ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గిపోవడం. దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు పిల్లలను పంపేం దుకు చాలా మంది తల్లిదండ్రులు ఇష్టపడలేదు. దీంతో ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. అలా ఏటా 17 శాతం మేర ప్రవేశాలు తగ్గినట్లు సమాచారం. దీంతో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిలో తేడా వచ్చింది. నిబంధనల ప్రకారం 20 మంది పిల్లలకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. విద్యార్థుల సంఖ్య తగ్గ డంతో ఎక్కువ మంది ఉన్న చోటకు టీచర్లను బదిలీ చేశారు. ఈ క్రమంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా 647 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

ప్రాథమిక పాఠశాలల విలీనం రద్దు ప్రకటన హర్షణీయం



ప్రాథమికపాఠశాలల విలీనం రద్దు ప్రకటన హర్ష ణీయం. రాష్ట్రవిద్యాశాఖ పాఠశాలల విలీనం రద్దు చేస్తామని ప్రకటించడం ప్రాథమిక విద్యకు ప్రాణం పోసినట్లయింది. ప్రతి కిలో మీటరు పరిధిలో ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తర గతి వరకు నడిచేలా చర్యలు చేపట్టాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి, రాష్ట్ర అధ్యక్షుడు

ఉపాధ్యాయ సంఘాలు చెప్పినా ..



ఉపాధ్యాయ సంఘాలు ఎంత చెప్పినా వినకుండా ఉపాధ్యాయులు, మేధావుల మనోగతానికి విరుద్ధంగా గత ప్రభుత్వం తీసుకువ చ్చిన 117 జీవో ద్వారా ప్రభుత్వపాఠశాలలు కను మరుగయ్యాయి. చాలా వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయా యి. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్య దూరమైంది. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ప్రాథమిక పాఠశాల లకు పూర్వవైభవం వచ్చినట్లయింది.

- ఎం.వెంకటశివారెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంది



ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు జీవో నెం.117ను రద్దు చేయడం సంతోషించదగ్గ విషయం. ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినప్ప టికీ గత ప్రభుత్వం జీవో117 అమలు చేసి ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం నిర్ణయం ద్వారా ప్రాథమిక పాఠ శాలలకు మళ్లీ పూర్వవైభవం వచ్చిందని చెప్పాలి.

- ఎ.శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

జీవో117 రద్దును స్వాగతిస్తున్నాం



నూతన జాతీయ విద్యావి ధానాన్ని అమలు చేసే సాకుతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో117ను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. జీవో 117 వల్ల ప్రభుత్వ విద్యారంగం అస్తవ్యస్తంగా తయారైంది. ఎన్నికలకు ముందు ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ఇచ్చిన హామీ మేరకు జీవో 117ను పూర్తిగా రద్దు చేయాల్సి ఉంది.

- ఎ.విజయకుమార్, యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు

జీవో 117పై సమగ్ర సమీక్ష చేయాలి



రాష్ట్రప్రభుత్వం జీవో 117పై సమగ్ర విశ్లేషణ చేసి తగిన నిర్ణయం తీసుకో వాలి. జీవో 117ను రద్దు చేసి వచ్చేవిద్యాసంవత్సరం నుంచి క్రమంగా రాబోవు విద్యాసంవత్సరంలో 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో తరగతి వారీగా పెంచుకుంటూ వెళ్లాలి. ఇప్పుడున్న ఉన్నత పాఠశాలల్లోని 3, 4, 5 తరగతు లను అలాగే కొనసాగించాలి. అప్పుడు పదోన్నతి పొందిన స్కూలు అసిస్టెంట్ల సర్దుబాటుకు తగిన సమయం ఉంటుంది.

- కె.సురేశ్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

ట్యాంకు పైనుంచి దూకి యువకుడి ఆత్మహత్య



పులివెందుల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డుశేషారెడ్డి స్కూలు సమీపంలో నివాసముంటున్న బాబుల్‌రెడ్డి (35) ఆదివారం ఉదయం ట్యాంకు పైనుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన బాబుల్‌రెడ్డి తల్లి దండ్రులు చనిపోవడంతో మేనత్త అయిన లక్ష్మమ్మ దగ్గరే ఉంటున్నాడు. కొన్ని సంవత్సరాల కిందట తల్లిదండ్రులు చని పోవడంతో బాబుల్‌రెడ్డికి మతిస్థిమితం సరిగాలేక మానసికంగా ఇబ్బంది పడు తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పులివెందులలోని రంగనాథ గుడి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు ఎక్కి కిందికి దూకడంతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న ఎస్ఐ విష్ణు సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలు సుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల సర్వజనా సుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొలెరో వాహనం ఢీ.. యువకుడి మృతి



ప్రమాదస్థలంలో చెన్నకేశవ మృతదేహం, చెన్నకేశవ (ఫైల్‌ఫొటో)

సంబేపల్లె/గోపవరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని ఎస్.సోమవరం గ్రామం బావులకాడపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నకేశవ (29) అనే యువకుడు అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గోపవరం మండలం పెద్దగోపవరం గ్రామానికి చెందిన చెన్నకేశవ వృత్తిరీత్యా బద్వేలులోని క్రిష్ణ కాంప్లెక్స్‌లో ఒక బార్బర్ షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఆరు నెలల పాప ఉన్నారు. చెన్నకేశవ వీలేరులో బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఇతని మరణ వార్త వినడంతో ఆ కుటుంబం విలపి స్తోంది. ఇక మాకు దిక్కెవరని కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భక వత్సలం తెలిపారు. కాగా మృతుడికి అమ్మతో పాటు మతిస్థిమితం లేని అన్న కూడా ఉన్నాడు. చెన్నకేశవ మృతితో ఆ కుటుంబానికి దిక్కులేకుండా పోయిం దని.. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జమ్మలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని దిగువపట్నం కాలనీ శివార్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... మున్సిపాలిటీ పరిధిలోని దిగువపట్నం కాలనీ శి వార్లలో 50 సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు ఆప్రాం తవాసుల పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలా నికి వెళ్లి పరిశీలించారు. మృతుడు బట్టతల కలిగి.. నలుపురంగు కాటన్ ప్యాం టు, బ్లూకలర్ గల్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా పూర్తిగా పాడైపోయింది. 3 నుంచి 4 రోజుల క్రితం ఆ ప్రాంతంలో మృతదేహం ఉన్నట్లుందని.. ఎవరైనా పైన తెలిపిన ఆనవాళ్లు తెలిస్తే అర్బన్ పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



వేంపల్లె సమీపంలో బోల్తాపడ్డ సిలిండర్ల లారీ

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణ సమీ పంలోని వేంపల్లె-పులివెందుల రోడ్డులో ఎస్ఎస్ఆర్ కల్యాణ మం డపం వద్ద హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాం టి ప్రమాదం జరగలేదు. వివరాల్లోకి వెళితే.. గ్యాస్ సిలిండ ర్లను నింపుకొని అనంతపురం నుంచి లక్కిరెడ్డిపల్లెకు లారీ బయలు దేరింది. ఆదివారం వేకువజామున వేంపల్లె సమీ పంలో అదుపుతప్పి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కొన్ని సిలిండర్లు దెబ్బతిన్నాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగ లేదు. అయితే లారీలోని సిలిండర్లు దెబ్బతిన డంతో పేలుతాయేమోనని స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది వద్ద ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్న ట్లు ఆర్కేవ్యాలీ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో ఇసుక తరలించు కోవచ్చని చెప్పడంతో పెద్దఎత్తున ఇసుకను తరలిస్తున్నారు. దీనికి తోడు ప్రస్తుతం అనుమతి లేని లారీలు, టిప్పర్లలో కూడా కొద్దిరోజులుగా పాపాఘ్నినది నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు ప్రచారం ఉంది. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించగా గవిమల్లేశ్వరాలయం సమీపంలో నది వద్ద ఉన్న రెండు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్, హిటాచిని స్వాధీనం చేసుకుని వేంపల్లె పోలీస్‌స్టేషన్‌కు అప్పగించా రు. స్వాధీనం చేసుకున్న వాహనాలను తహసీల్దార్ హరినాథరెడ్డికి అప్పగించ నున్నట్లు వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. తదుపరి చర్యలు తహసీల్దార్ తీసుకోవాల్సి ఉంది.

ఇసుకరీచ్‌లపై మొబైల్ పార్టీ దాడులు

కొండాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకరీచ్‌లపై ఆదివారం మొబైల్‌పార్టీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కడప నుంచి వచ్చిన మొబైల్ స్క్వాడ్ ఏటూ రు ఇసుకరీచ్‌ను తనిఖీ చేశారు. అక్కడ లోడింగ్ చేసిన నాలుగు ఇసుక టిప్పర్లను పరిశీలించారు. అయితే వాటికి శనివారం నాటి బిల్లులు ఉండటంతో ప్రశ్నించారు. రాత్రి కావడంతో వెళ్లలేదని టిప్పర్ల యజమానులు తెలిపారు. దీంతో ఈ టిప్పర్లపై తహసీల్దార్‌కు విచారణకు ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేసా ్తమని హెచ్చరించారు. కార్యక్రమంలో మొబైల్‌టీమ్, రెవెన్యూ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు



మోడెం చౌడయ్య (ఫైల్)

చిన్నమండెం, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన మోడెం చౌడ య్య కనిపించడం లేదని అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వివరాల ప్రకారం... మల్లూరు గ్రామ కోడిదేవపల్లికి చెం దిన మోడెం చౌడయ్య (44) వ్యవ సాయం చేసేవాడు. మంగళవారం ఉదయం 5 గంటల నుం చి కనిపించలేదని.. తమకు తెలిసిన ప్రాంతాలన్నీ వెతికినా ఆచూకీ లభించలేదని అతని భార్య మోడెం కుమారి పోలీ సులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి



ప్రొద్దుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూ రు మండల పరిధిలోని మడూరు క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫీ వివరాల మేరకు.. చాపాడు మండలం మడూ రు గ్రామానికి చెందిన మహబూబ్ షరీఫ్(50) తినుబండా రాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో ప్రొద్దుటూరు నుంచి తన స్వగ్రామం మడూరుకు బయలుదేరాడు. మడూరు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా జమ్మలమడుగు వైపు నుంచి వేగంగా వస్తున్న బొలెరో వాహనం అతన్ని ఢీకొట్ట డంతో బైక్ పై నుంచి కింద పడ్డాడు. ఈ క్రమంలో తలకు బలమైన గాయాలు కావడంతో షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

'పారిపోయిన ఖైదీది చిత్తూరు జిల్లానగరి'

కడప క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత నెల 30న ఓపెన్ జైలు నుంచి పారిపోయిన ఖైదీ తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారు కాదని చిత్తూరు జిల్లాలోని నగరిప్రాంతానికి చెందిన శరవణ్ అని కడప కేంద్ర కారాగార సూపరిం టెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రకటనలో తెలిపారు. జైలు నుంచి పారిపోయిన వెంటనే రిమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వర్క్ కేసు నమోదు చేశారని.. ఇతర రాష్ట్రాలకు చెందిన ఖైదీలను ఓపెన్ జైలుకు ఎంపిక చేయమని తెలిపారు. నింది తున్ని అరెస్టు చేసి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

సుండుపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, ఆయన కూతురిపై అసభ్యకర పోస్టులు పెట్టడంపై జనసేన నాయకుడు రామాశ్రీనివాసులు ఆది వారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్విట్టర్ అకౌంట్‌లో అసభ్యకర పోస్టులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడి యాలో అసభ్యకర పోస్టులు చేసిన వారిని గుర్తించి వారి సోష ల్ మీడియా అకౌంట్‌తో సహా పోలీసులకు అందజే శామ న్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సు వ్యాలిడిటీ పెంపు

- నవంబరు 8 నుంచి పర్మినెంటు లైసెన్సుతోనే వ్యాపారం

పులివెందుల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల ప్రొవిజనల్ లైసెన్సుల గడువు మరో నాలుగురోజుల పాటు పెంచుతూ ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసకుంది. తొలుత అక్టోబరు 31తో ప్రొవిజనల్ లైసెన్సుల గడువు ముగు స్తుందని.. నవంబరు 1 నుంచి పర్మినెంటు లైసెన్సు ఉంటేనే వ్యాపారం చేయా లని ప్రభుత్వం మార్గదర్శకాలు చేసింది. కానీ నిర్దీత గడవు అక్టోబరు 30 నాటికి మద్యం షాపుల లైసెన్సుదారుల నుంచి పర్మినెంటు లైసెన్సుల కోసం పెద్దగా స్పందన లేదు. ఈ క్రమంలో ఈ నెల 7 వరకు ప్రొవిజనల్ లైసెన్సు వ్యాలిడిటీ పెంచడంతో పాటు నవంబరు 8 నుంచి పర్మినెంటు లైసెన్సు ఉంటేనే మద్యం వ్యాపారాలు చేసే వీలుంటుందని ఎక్సైజ్ శాఖ తెలిపింది. కడప జిల్లావ్యాప్తంగా 139 మద్యం షాపులకు ప్రొవిజనల్ లైసెన్సులను అక్టోబరు 15న ఎక్సైజ్ శాఖ సదరు యజమానులకు అందించింది. తొలుత ప్రకటించిన అక్టోబరు 31 గడువు నాటికి 139 షాపుల్లో 20 మందికి కూడా పర్మినెంటు లైసెన్సు ప్రొసీజర్ పూర్తి చేయలేదని అధికారులు చెబుతున్నారు. చాలా షాపుల లోకేషన్ విషయంలో యజమానులు ఓ అంచనాకు రాకపోవడంతో బ్యాంకు గ్యారంటీలు సమర్పించ డంలో కూడా జాప్యం జరగడంతో గడువు పొడిగించారని పులివెందుల ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. పెంచిన గడువు ఉపయోగించుకుని నిర్దీత తేదీలోగా మద్యం షాపులకు పర్మినెంటు లైసెన్సు పొందాలని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధి కారులు తెలిపారన్నారు. లోకేషన్ ఎంచుకునేటప్పుడు ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా షాపు లోకేషన్ విషయంలో నిబంధనలు పాటించలేదని అధికారుల దృష్టికి వస్తే పర్మి నెంటు లైసెన్సు ఇవ్వడం జరగదన్నారు. దీంతో పాటు బ్యాంకు గ్యారంటీ, కౌంట రు పార్టీ అగ్రిమెంటు, షాపు లీజు, ఇతర డాక్యుమెంట్లు కూడా ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో అందించాలని, నవంబరు 7 కల్లా పర్మినెంటు లైసెన్సులు పొం దాలని మద్యంషాపుల యజమానులను ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు కోరుతున్నారు.

చిల్లర దొంగల హల్‌చల్... పలు షాపుల్లో చోరీ

కడప క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో చిల్లర దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు దొంగలు అక్కడ తాళాలు వేసిన కొన్ని షాపుల్లోకి చోరీ యత్నం చేశారు, కొన్ని షాపుల షట్టర్లను తెరిచేందుకు విఫలయత్నం చేశారు. కొన్ని షాపుల్లో దేవుని వద్ద ఉంచిన హుండీలో చిల్లర డబ్బులు చోరీ చేయగా.. కొరియర్ ఆఫీసులోకి వెళ్లి అక్కడ పార్సల్‌లో ఉన్నటువంటి టీషర్టులను వేసుకుని ఇద్దరు దొంగలు గొడవ పడ్డ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. అయితే రెండుషాపుల్లో దాదాపు రెండువేలకు పైగా నగదు దొంగలు అపహరించినట్లు తాలుకాసీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా ఇప్పటి వరకు బాధితులు ఫిర్యాదు చేయలేదని, వారు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారిస్తామన్నారు. కాగా పోలీసులు ఒక దొంగను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది.

రేపు కొండయ్యస్వామి పుట్టినరోజు వేడుకలు



మైదుకూరు రూరల్, నవం బరు 3 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ధరణి తిమ్మా యపల్లెలో అవధూత కొండ య్యస్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో మంగళవారం కొండయ్య స్వామి పుట్టినరోజు సంద ర్భంగా భారీ కేకును కట్‌చేసి భక్తులకు పంచిపెడతారు. రాత్రి జబర్దస్త్ టీమ్ వారిచే నవ్వుల కార్యక్రమం ఉం టుంద న్నారు. బుధవారం వృషరాజములచే బండలాగు పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతిరోజు భక్తులకు అన్నదానం ఉంటుందని కొండయ్యస్వామి శిష్య బృందం తెలిపారు.

వ్యాధుల తీవ్రతపై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రపంచంలో వ్యాధుల తీవ్రతపై ఎప్పటికప్పుడు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కడప ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ జోనల్ సీఎంఈ కోఆర్డినేటరు, కడప ప్రభుత్వ వైద్య కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనరసమ్మ తెలిపారు. ఆదివారం కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణలో ఫిజి యాలజీ లెక్చర్ గ్యాలరీలో డాక్టర్ ఎన్టీఆర్‌హెల్త్ యూని వర్శిటీ ఆధ్వర్యంలో జోనల్ 3 సీఎంఈ కార్యక్రమం నిర్వ హించారు. మైక్రో బయాలజీ హెచ్‌వోడి డాక్టర్ బి.నాగ శ్రీలత పాల్గొని మాట్లాడారు. కడప ప్రభుత్వ వైద్య కళా శాల మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నాగ సుధారాణి, డాక్టర్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్‌ఫ్యాకల్టీ నియామకాలకు నేడు ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూ లోని పీజీ కళాశాలలో సోమవారం గెస్ట్‌ఫ్యాకల్టీ నియా మకానికి సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి ప్రకటనలో తెలిపారు, కామర్స్ సబ్జెక్టుకు గెస్ట్‌ఫ్యాకల్టీ ఎంకాం అర్హతతో పాటు పీహెచ్‌డీ నెట్ సెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. కాంపి టిషన్ డేటా సైన్స్ సబ్జెక్టుకు ఎమ్మెస్సీ మ్యాథ్స్, ఎమ్మెస్సీ కంప్యూటరు సైన్స్ ఎమ్మెస్సీ డేటా సైన్స్, ఎంసీఏలలో ఏదోక అర్హతతో పాటు పీహెచ్‌డి, నెట్ సెట్ అర్హత కలిగి ఉండా లన్నారు. అభ్యర్థులు అర్హత పత్రాలతో సోమవారం ఉద యం 10గంలకు వైవీయూ క్యాంపస్ ప్రిన్సిపల్ చాంబరులో హాజరు కావాలన్నారు.

పేరుకు పెద్ద - పోగేసింది గుట్ట

కొండపేటలో కబ్జాదారు ● కన్నేసిన స్థలాల కోసం ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారీ

వ్యవసాయ స్థలం, బావి, దారులు, ఇళ్లు అన్నీ హాంఫట్ ● విలువ రూ.2కోట్లు పైనే

చెన్నూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పైకి పెద్ద మనిషి, అందరికీ నీతులు చెబుతారు. నోరుతెరిస్తే అబద్దాల పుట్ట పోగేసుకుంది అక్రమాల గుట్ట. వైసీపీ ప్రభుత్వంలో అధికారం బలంతో ఇష్టానుసారం చేశాడు. చివరికి కోట్లు విలువైన పేదల స్థలాలు, బావి, దార్లు, వ్యవసాయ స్థలాలు ఒకటేంటి ఏది పడితే అది తనదే అంటూ నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసుకున్నాడు, రిజిస్ట్రారు ఆఫీసులో తన పని పూర్తి చేసుకున్నాడు. ఇది కొంత మేరకే. బయట పడాల్సింది మరింకెంతుందో. ఇదంతా బయటికి తేలాల్సి ఉంది. వివరాల్లోకెళితే...

చెన్నూరుకు పక్కనే వున్న పెన్నానది వంతెన పక్కనున్న గ్రామం బయనపల్లె ఉరఫ్ కొండపేట. ఇక్కడ ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ కూలీలున్నారు. ఓ వ్యక్తి తాను వైసీపీ నేత అని చెప్పుకుంటూ తిరిగేవాడు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తన విశ్వరూపం చూపాడు. ప్రజా సంబంధమైన బావి స్థలం, నడిచే దారి, పేదల వ్యవసాయ స్థలాలు, మెతగ్గా ఉన్న మరికొందరి ఇళ్లను అమ్మినట్లు ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసుకున్నారు. తనకు వారసత్వంగా వచ్చిన ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకునే తరుణంలో గప్‌చుప్‌గా తన ఆస్తిలో వీటిని కలుపుతూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అయితే కొద్దిరోజుల కిందట వీటి బాగోతం బయట పడింది. దీంతో ఆయా స్థలాల యజమానులు వాటిని మేం అమ్మకుండా మరొకరి పేరుపై డాక్యుమెంట్లు ఎలావెళ్లాయి, ఇంకొకరికి రిజిస్ట్రేషన్లు ఎలా అయ్యాయని ఆశ్చర్యపోతూ ఆవేదనకు గురయ్యారు. ఇది పక్కా మోసం, వాటిని తయారు చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఆగ్రహిస్తున్నారు.

విలువ రూ.2కోట్లు పైమాటే

తప్పుడు డాక్యుమెంట్లు తయారు చేసుకుని తన ఆస్తిలో కలిపేసుకుని డాక్యుమెంట్లు రాయించుకున్న వాటి విలువ ప్రస్తుతం రూ.2కోట్లు పైమాటే. చెన్నూరు పక్కనే కొండపేట గ్రామం ఉంది కాబట్టి ఆ గ్రామం కూడా చెన్నూరుతో కలిసిపోయింది. సెంటు స్థలం రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల పైమాటే. అలాంటి చోట విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోడంపై ప్రజలు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఇలాంటి వారు ఇంకా ప్రజల ఆస్తులు ఇంకా ఎన్నికబ్జా చేశారో బయటపెట్టాలని అంటున్నారు.



చెన్నూరు - కొండపేట వంతెన

ఎమ్మెల్యేకుఫిర్యాదు

తమకు తెలియకుండా స్థలాలను ఫోర్జరీ డాక్యుమెంటుతో తన ఆస్తిలో కలుపకున్న విషయమై ఇటీవల ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డికి బాధితులు ఫిర్యాదు చేశారు. వీరి స్థలాలు పరాయి వారికి వెళ్లపోవడంపై ఎమ్మెల్యే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పేదల స్థలాలపై ఇలాంటి పద్దతులు అవలంభించిన వ్యక్తులను వదిలేది లేదన్నారు. కలెక్టరుకు ఈ విషయ మై చెప్పడం, ప్రజలకు తెలియకుండా వారి ఆస్తులను సొంత ఆస్తిగా కలిపేసు కోడంపై ఎస్పీకి సైతం చెప్పి తగిన రీతిలో చర్యలు తీసు కోమని కూడా స్థలాలు పోగొట్టుకున్న బాధి తులకు ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటికే ఆ స్థలాలపై లోతుగా విచారణ జరుగుతున్న ట్లు తెలుస్తోంది. ఏదేమైనా కొండపేట లాంటి గ్రామంలో కబ్జాలు లేని ఊర్లో ఇలాంటి వ్యక్తి ఉండడంతో ఆ ప్రాంత ప్రజ లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కలెక్టరు, ఎస్పీకి ఫిర్యాదు

స్థలాలు పోగొట్టుకున్న బాధితులు సోమవారం జరిగే గ్రీవెన్‌సెల్‌లో కలెక్టరు, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. తమకు న్యాయం జరగడంతో పాటు భవిష్య త్తులో ఇలాంటివి జరగకుండా చూసేందుకు వారు కోరుతున్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి ఓబులేసు



ఫటాఫట్

ప్రతి రైతు సాగుచేసే పంటకు వాడే విత్తనాలు తప్పనిసరిగా శుద్ధి చేయాలని మండల వ్యవసాయాధికారి జీపీ ఓబులేసు సూచించారు.

?: విత్తన శుద్ధి ఎలా చేయాలి

!: రబీ సీజన్‌లో 1641క్వింటాళ్లు బుడ్డశనగలు రైతులకు పంపిణీ చేశారు. కిలో విత్తనానికి 10గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పౌడర్‌తో విత్తనశుద్ధి చేయాలి. దీంతో పంటను చీడపీడల నుంచి కాపాడుకుని అధిక దిగుడులు పొందవచ్చున్నా.

?: ఈ ఏడాది వరి దిగుబడులు ఎలా ఉన్నాయి?

!: 2024ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంటలో మంచి దిగుబడులు వచ్చాయి. ఎకరాకు 32 నుంచి 35బ్యాగుల (76కిలోలు) దిగుబడి వచ్చింది. బ్యాగు రూ.1700కు పొలం వద్దకే వెళ్లి వ్యాపారులు కొనుక్కుంటున్నారు.

?: వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు ఎప్పుడు వస్తాయి

!: రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రోటవేటర్, స్ప్రేయర్, టార్పాలిన్ పట్టలు, విత్తన గొర్రు 7,9 మడకల గొర్రు, గుంటకలు ప్రభుత్వం రాయితీతో ఇస్తారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక పంపామని అవి రాగానే రైతులకు అందజేస్తారు.

?: 'పొలం పిలుస్తోంది' రైతులకు ఉపయోగమేనా

!: పొలం పిలుస్తోంది ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పొలాలను పరిశీలించి పంటలకు సోకిన తెగుళ్ల పరిశీలించి వారికి సూచనలు, సలహాలు ఇస్తారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది ఉంటుంది.

?: వేరుశనగ రైతులు విత్తన శుద్ధికి ఏం వాడాలి

!: రబీలో వేరుశనగ పంట సాగుచేసే రైతులు కిలో విత్తనానికి మూడు గ్రాముల ఎం45 పౌడర్‌తో విత్తనశుద్ధి చేయాలి.

పెండ్లిమర్రి,(ఆంధ్రజ్యోతి):

12వ పీఆర్సీ, మధ్యంతర భృతిని సీఎం ప్రకటించాలి

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి

వేంపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పీఆర్సీ రివర్స్ విధానాన్ని చూపి ఉపాధ్యాయ ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా చర్చించి మధ్యంతర భృతిని ప్రకటించాల్సిన అవసరం ఉందని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వేంపల్లెలో ఆదివారం జరిగిన ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యాయ ఉద్యోగుల సంక్షేమం కోసం ఉన్న బీమా క్లెయిమ్‌లు 18 నెలలుగా చెల్లింపు ప్రక్రియ ఆగిపోయిం దని, ఈ ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ద్వితీయశ్రేణి ఉద్యోగులు కాదని, ఉద్యోగులతో సమానమన్నారు. ఎస్టీయూ నేతలు గంగిరెడ్డి, సంగమేశ్వరరెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో ఆనందం టీడీపీ ధ్యేయం

- కమలాపురం టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తానరసింహారెడ్డి

వల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆనందం కోసం రైతులు పండించే పంటలకు అధిక దిగుబడులు కల్పించి వారి ఎదుగుదలకు టీడీపీ ప్రభుత్వం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని కమలాపురం టీడీపీ ఇన్‌చార్జ్ టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం అంబవరం చెరువు నుంచి నీటిని కలిసి విడుదల చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రైతుల కోసం టీడీపీ ప్రణాళికలు రూపొందించిందన్నారు. రాబోయే కాలంలో రైతులు పండించే ప్రతి పంటకు ధరలు కల్పించి వారి అభివృద్ధికి పాటుపడతామన్నారు. పలు గామాల చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉందని, వాటి ద్వారా ఆయా ఆయకట్టు భూముల రైతులు పంటలు పండించేందుకు వీలుగా అన్ని కార్యక్రమాలు ఇప్పటికే తాము చేపట్టామన్నారు. అంబవరం చెరువు నుంచి దాదాపు 350 ఎకరాలకు ఈ నీరు ఉపయోగపడుతుందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు, మందులు, ఇతరత్రా విషయాలను దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి అటంకం లేకుండా పంటలు పండించుకునే అవకాశాలు కల్పించిన ఘనత తమ పార్టీ దన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, నల్లపురెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, శివారెడ్డి, క్రిష్ణారెడ్డి, పాపిరెడ్డి, సుధా మదన్ మోహన్‌రెడ్డి. రమణారెడ్డి, మునీంద్ర, లక్ష్మిరెడ్డి, క్రిష్ణయ్య, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, రామసుబ్బారెడ్డి, స్థానిక రైతులు, పుత్తా అనుచరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నీటిని విడుదల చేసేందుకు వెళుతున్న పుత్తా నరసింహారెడ్డి, రైతులు

'బ్రౌన్'కు సంపత్‌కుమార్ వెలుగు

వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్రౌన్‌కు వెలుగునిచ్చి స్థల దాతగా చరిత్ర పుటల కెక్కిన మహాదాత సంపత్ కుమార్ అని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో సంపత్‌కుమార్ 84వ జయంతి నిర్వహించారు. సంపత్ చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ సంపత్‌కుమార్ గ్రంథాలయ నిర్మాణానికి 20 సెంట్లు స్థలం ఇవ్వడమే కాక మెమోరియల్ ట్రస్టుకు అధ్యక్షులుగా సేవలందించి సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ ప్రసంగించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, హరిభూషణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సంపత్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

అక్రమ మద్యం స్వాధీనం - ఒకరి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ, పోలీసులు

వల్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పైడికాల్వ క్రాస్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారం రావడంతో సీఐ రోషన్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఏఎస్ఐ అందించిన వివరాల మేరకు శీతోరుపల్లె వాసి రెడ్డయ్య అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి దాడులు చేసి అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి, పది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ సభ్యత్వం కుటుంబానికి అండ

చెన్నూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటుందని జిల్లా గ్రంథాలయ మాజీచైర్మన్ రామకోటిరెడ్డి అన్నారు. ఉప్పరపల్లెలో ఆదివారం సభ్యత్వ నమోదు ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీలో ఉన్న ఓటర్లలో టీడీపీ కార్యకర్తలుగా సగం మందితో సభ్యత్వం చేయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభ్యత్వంతో రూ.5లక్షలు ప్రమాద బీమా, భవిష్యత్తులో మరెన్నో ప్రయోజనాలుంటాయని ఇది కేవలం పార్టీ సభ్యత్వం కాదని భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి భరోసా అని అన్నారు. కార్యక్రమంలో ఉప్పరపల్లె టీడీపీ నేతలు గుణ, శివ, ఆవుల రవిరెడ్డి, ఆవుల శంకర్‌రెడ్డి, నియోజకవర్గ మండల ఐటీడీపీ ఛాంపియన్‌లు బిట్టి ఆది, యామల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం : టీఎన్ఎస్ఎఫ్



టీడీపీ సభ్యత్వ నమోదులో మాసాపేటశివ తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ప్రధాన లక్ష్యమని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ అన్నారు. ఆదివారం కడప నగరం 26వ డివిజన్ మాసాపేట సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడుతూ బీమాతో కూడిన వంద రూపాయల సభ్యత్వ నమోదు కార్యకర్తల జీవితానికి భరోసా ఇస్తుందన్నారు. పార్టీసభ్యత్వం ఉంటే కుటుంబానికి రక్షణ కవచంగా ఉంటుందని ఓటు హక్కున్న ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శంకర్, మౌనిక, ఎన్ఆర్ఐ నాయకులు రహ్మతుల్లా, రాఘవ, జనార్ధన్, అనిల్, చిన్నా, ఆనంద్ పాల్గొన్నారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధులు

జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారి సిద్దయ్య

పులివెందుల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): దోమలతో అనేక ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని, జాగ్రత్తలు పాటిస్తే వాటిబారిన పడకుండా ఉండవచ్చని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని బాలికల హాస్టల్ విద్యార్థినులకు మలేరియా, డెంగ్యూ, గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. వైరస్ ఇన్ఫెక్ట్ అయిన దోమకాటు తర్వాత మూడు నుంచి 14రోజుల్లో డెంగ్యూ రావచ్చన్నారు. మెదడువాపు వ్యాధి కూడా ఒక వైరస్ వలన కలిగే వ్యాధి వైరస్‌తో ఇన్ఫెక్ట్ అయిన క్యూలెక్స్ దోమ కాటు ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధుల లక్షణాలు, చికిత్స గురించి వివరించారు. అలాగే దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

నూతన సర్కిల్స్‌కు పోస్టులు ఇవ్వాలి

కడప నాగరాజుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్వీసులు, లెన్త్ ఆఫ్ లైన్స్, డీటీఆఈఆర్‌లు నాలుగు రెట్లు పెరిగినా ఉద్యోగుల పోస్టులు మాత్రం పెరగడం లేదని వాటిని పెంచాలని విద్యుత్ స్ట్రగుల్ కమిటీ చైర్మెన్ పోతలూరి సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి కోరారు. నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విద్యుత్ ట్రేడ్ యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ వర్క్ నార్మ్స్ ప్రకారం పోస్టు శాంక్షన్ చేసి కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్లతో భర్తీ చేయాలన్నారు. ఇంకా పలురకాల సమస్యలపై మాట్లాడారు. సమావేశంలో స్ట్రగుల్ కమిటీ నేతలు ఎస్‌జీశేఖర్, సురేంద్ర, నాగమల్లయ్య, బాష పాల్గొన్నారు.

కడపలో క్లబ్‌లపై దాడులు

కడప(క్రైం)నవంబరు3(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని క్లబ్‌లపై ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో తనిఖీ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

పూలకలశ ఊరేగింపు

కడప కల్చరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 తేదీ నుంచి 21 వరకు జరగనున్న పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల నషాన్ (ఝూల) పూలకలశ ఊరేగింపు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మాసాపేటలోని షై అల్లా దర్గా వద్ద నుంచి విద్యుత్ దీపాలు, డప్పు వాయిద్యాలతో, బాణసంచా మోతతో అంగరంగ వైభవంగా ఊరేగింపు జరిగింది. క్రిష్ణా సర్కిల్ మీదుగా సెవెన్‌రోడ్స్ సర్కిల్, వన్‌టౌన్ సర్కిల్, గోకుల్ సర్కిల్ మీదుగా వైవీ స్ట్రీట్ మీదుగా ఊరేగింపు దర్గా చేరుకుంది. దర్గా ప్రతినిధులు, నగర ప్రజలు ప్రముఖులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పూలకలశం

ప్రారంభమైన అంతర్ కళాశాలల క్రీడలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో రెండో దశ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు వైస్ చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్, షూటింగ్ తదితర పోటీలను వ్యాయామ విద్య, క్రీడాశాస్త్ర విభాగాల్లో పోటీలుంటాయి. పది కళాశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ పద్మ, కోర్సు బోర్డు కార్యదర్శి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



షూటింగ్‌లో పాల్గొన్న వైస్‌చాన్సలర్ కె.క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ పద్మ

శిల్పారామంలో అలరించిన ఆటపాట

కడప కల్చరల్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై నృత్యాలు అలరించాయి. ఆదివారం ఆటవిడుపులో భాగంగా నగర రిమ్స్ సమీప శిల్పారామంలో పరిపాలనాధికారి మధుసూదన్‌బాబు పర్యవేక్షణలో విస్బా మూవీ సహకారంతో కిశోర్ డ్యాన్స్ అకాడమీ యువకులు వివిధ జానపద, శాస్త్రీయ, సినీ గీతాలకు చేసిన నృత్యాలు అలరించాయి. ప్రధానంగా జానకి రాముడులో అదిరింది మామా, కాకినాడ ఖాజా తినిపిస్తాడంట.., గాజువాక పిల్ల.. తదితర గీతాలకు వేసిన స్టెప్స్ కరతాళ ధ్వనులు అందుకున్నాయి.



శిల్పారామంలో సందడి చేస్తున్న యువత

విజయభాస్కర్‌కు సాహితీ రత్న సేవా పురస్కారం

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఆదివారం అరిగెపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీసేవా రత్న బిరుదును జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయ భాస్కర్‌కు అందించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమరేశ్వరి ద్వారా పురస్కారాన్ని విజయభాస్కర్ స్వీకరించారు. కార్యక్రమంలో లయన్ విజయకుమార్‌తో పాటుపలువురు పాల్గొన్నారు.



విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమరేశ్వరి

డ్రైవర్స్‌డేని అధికారికంగా ప్రకటించాలి

కడప నాగరాజుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లకు ప్రత్యేకించి డ్రైవర్స్‌డే అధికారికంగా ప్రకటించాలని సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆలిండియా ఫౌండేషన్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్ అన్వర్‌బాషా కోరారు. డ్రైవరు రంగంలో అహోరాత్రులు సేవలు అందిస్తున్న డ్రైవర్లకు డ్రైవర్స్‌డే అంటూ ఒక రోజును ప్రత్యేకంగా క్యాలెండరులో ప్రకటించాలన్నారు. ఆదివారం వైసీపీ కార్యాలయం వద్ద నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ కాలేజీ వద్ద డ్రైవర్లు డిమాండ్ చేశారు. అంతేకాక ప్రభుత్వం డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



నినాదాలు చేస్తున్న డ్రైవర్లు

జనసేనలోకి చేరికలు



జనసేనలోకి చేరుతున్న ప్రజలు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 11వ డివిజన్ మృత్యుంజయకుంటలో జనసేన నగర అధ్యక్షుడు బోరెడ్డి నాగేంద్ర ఆధ్వర్యంలో దాదాపు 150 కుటుంబాలు జనసేన లోకి చేరాయి. ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటరు కడప అసెంబ్లీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ సమక్షంలో కొవ్వూరు అశోక్, యువకులు మహిళలు 150 మంది కుటుంబాలు జనసేనపార్టీలో చేరాయి. కార్యక్రమంలో ప్రచార కమిటీ కోఆర్డినేటరు పత్తి విసు, సీనియర్ నేతలు జీవీ రమణ, మాలే శివ, హరి, నగర కమిటీ కార్యదర్శి బసెట్టి స్వరూప్, అక్కాయపల్లె వెంకటేశ్ పాల్గొన్నారు.

'ర్యాంకులపై విచారణ జరిపించాలి'

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): లా విద్యార్థుల కౌన్సెలింగ్, ర్యాంకులపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, అధ్యక్షుడు కె.శివశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం హోచిమన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నిర్వహించిన ఏపీ లా ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల చేసి వాటికి శనివారం ర్యాంకుల ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. అయితే ఏపీ లా సెట్‌లో ఎల్ఎల్ఎం విద్యార్థులు 2480 మంది రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు చేసుకోగా, 2460 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారన్నారు. రాష్ట్రంలో 260 ఎల్ఎల్ఎం, పీజీ సీట్లకు ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో 150 సీట్లకు 123 సీట్లు మొదటి విడత కౌన్సెలింగ్ జరిగిందన్నారు. ఓపెన్ కేటగిరిలో విద్యార్థులకు అన్యాయం చేస్తూ తక్కువ ర్యాంకు వచ్చిన విద్యార్థులకు గాకుండా ఎక్కువ ర్యాంకు వచ్చిన విద్యార్థులకు కేటాయించారన్నారు. దీనిపై విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు తేజా, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

మైదుకూరు రూరల్‌నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేదవానికి పట్టెడన్నం పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌_ను ప్రారంభిస్తోంది. అందులో భాగంగా మైదుకూరులో ప్రొద్దుటూరు రోడ్డులోని 16 వార్డులో సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఉదయం 7 గంటలకు అన్నక్యాంటీన్ ప్రారంభిస్తారని ఆయన పీఏ ఆది విలేకరులకు ప్రతికా ప్రకటనలో తెలిపారు. కేవలం ఐదు రూపాయలకే టిఫెన్,బోజనం లభిస్తోండటంతో పేద ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

పోరుమామిళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని హుసేన్‌పీర్ దర్గా ఆవరణంలో ఉన్న మహబూబ్ సుభాని దర్గాలో గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుస్తక పఠనం అయిన తరువాత ఆదివారం అక్కడ ఫాతెహా , అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ శ్రీనివాసులు హాజరై ప్రార్ధనలు చేశారు.

రేషన్ డీలర్ల అక్రమాలకు ఏదీ అడ్డుకట్ట..?

డీలర్లపై కార్డుదారుల ఆగ్రహం ● చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి

జమ్మలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని రేషన్‌డీలర్ల అక్రమాలపై అడ్డుకట్ట వేయాలని పలువురు కార్డుదారులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వంలో రేషన్‌డీలర్లు షాపు చేజిక్కించుకున్న తర్వాత ఇష్టారాజ్యంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెలలో రేషన్ డీలర్లు మూడు రోజులకు మించి పంపిణీ చేయలేదని, షాపు వద్దనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జమ్మలమడుగులోని అంబాభవానీదేవాలయం వీధి, మెయిన్‌బజార్, దిగువపట్నం కాలనీ, ఎస్.ఉప్పలపాడు, నాగులకట్ట, మోరగుడి, తదితర ప్రాంతాల్లో మరి కొంతమంది డీలర్లు రేషన్‌షాపునకు వచ్చినవారిపై ఆగ్రహంతో బియ్యం లేవని చెప్పడం దారుణంగా ఉందని వాపోతున్నారు. తమ బియ్యం ఎక్కడికి వెళ్లాయని అడిగినవారిపై దిక్కున్నచోట చెప్పుకోమని చెబుతున్నట్లు రేషన్ షాపు వద్దనే పలువురు 'ఆంధ్రజ్యోతి'కి తెలియజేశారు. గత నెలలో కందిబేడలు కూడా డీలర్లు తెచ్చుకుని కొందరు పంపిణీ చేయలేదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం కార్డుదారులకు బియ్యం తూకాల్లో కార్డును బట్టి రెండు నుంచి 4 కేజీల తూకం తక్కువ ఇస్తున్నారని వాపోయారు. అలాగే కందిబేడలకు కిలో రూ.70, చక్కెరకు రూ.20 వసూలు చేస్తున్నారని, అదనంగా వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రేషన్ గోడౌన్ వద్ద నుంచి తమకు బియ్యం తక్కువగా స్టాక్ ఇచ్చారని, కార్డుదారులకు కొందరు డీలర్లు చెబుతున్నారని వాపోయారు. సివిల్‌సప్లై గోడౌన్ వద్ద నుంచి తక్కువ తూకాలతో అక్రమాలు జరుగుతున్నాయంటూ కొందరు డీలర్లు చెప్పడం, సాకుగా చూపి డీలర్లు బియ్యం పంపిణీలో తక్కువ తూకాలు చేతివాటం ప్రదర్శిస్తున్నారని పంపిణీ కేంద్రాల వద్దనే కార్డుదారులు డీలర్లను నిలదీస్తున్నారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోమని బహిరంగంగా చెప్పుతున్నారని పలువురు వాపోతున్నారు. జమ్మలమడుగు డివిజన్ కేంద్రంలోని డివిజన్‌స్థాయి అధికారులు ఉన్నప్పటికీ రేషన్‌డీలర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని బహిరంగ విమర్శలు ఉన్నాయి. కొందరు డీలర్లు బియ్యం తెచ్చుకున్న వెంటనే వారి వారి స్టాకును బట్టి ముందుగానే ఒక్కొక్కరు పది బస్తాలకు తక్కువ కాకుండా పక్కదారి పట్టించి స్వలాభం కోసం కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయకుండా స్టాక్ తక్కువగా ఇచ్చారని, వేరే వీధుల్లో నుంచి కార్డుదారులు వచ్చి బియ్యం తీసుకెళ్లారంటూ కార్డుదారులకు చెబుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ సమస్యలకు సంబంధించి ఇటీవల జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి తనిఖీలు చేసినప్పటికి డీలర్లు వారి ఆదేశాలు బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా బయట విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ సమస్యకు సంబంధించి ఆదివారం జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తాను తనిఖీలు చేసినప్పుడు ప్రజలు ఈ సమస్యలు తన దృష్టికి తెచ్చారని, సోమవారం నుంచి డీలర్ల అక్రమాలపై విచారణ జరుపుతామని, వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



రేషన్ షాపు వద్ద గుంపులుగా నిలబడి ఉన్నలబ్ధిదారులు

18న సచివాలయాల్లో అర్జీలు సమర్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని ఈనెల 18వ తేదీన సచివాలయాల్లో అర్జీలు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకోసం పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని, పార్టీ సభ్యత్వాల నిర్వహణ చేపట్టి పార్టీ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, శివారెడ్డి, హరి, రామక్రిష్ణ, శ్రీనివాసులు, ప్రమీళ, సుజాత పాల్గొన్నారు.

చెత్త బయట వేస్తే జరిమానా

మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు , నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా చెత్త రోడ్లపై వేస్తే జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు డ్రైనేజీ కాలువలు ఆక్రమించి వాటిపై కట్టిన కట్టడాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న షాపు పేర్లతో ఉన్న బోర్డులను తొలగించు కోవాలని, పట్టణ పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటు పడాలన్నారు. అలాగే పురపాలక సంఘానికి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో టీపీఓ సతీష్, పార్థసారథి, వెంగళరెడ్డి తదితరులు ఉన్నారు.

మైలవరం జలాశయానికి నీటి నిలుపుదల

కొండాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):గండికోట నుంచి మైలవరం జలాశయానికి ప్రస్తుతం నీరు నిలుపుదల చేసినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అవుకు రిజర్వాయిర్ నుంచి ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులోకి కృష్ణాజలాలు రావడం లేదన్నారు. దీంతో మైలవరంతో పాటు గండికోటప్రాజెక్టు అనుబంధ జలాశయాలకు నీటిని విడుదల చేయడంలేదన్నారు. కాగా గండికోటప్రాజెక్టులో ప్రస్తుతం 26.4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

మధ్యంతరభృతి ప్రకటించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 30 శాతం మధ్యంతరభృతిని 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకట జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పీఆర్సీ వలన ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, అలాగే ప్రస్తుత ప్రభుత్వం పీఆర్సీపై ప్రకటన చేయకపోవడంతో ఒక సంవత్సరం వేతన పెంపును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మధు ,జిల్లా కార్యదర్శి షరీఫ్ , నాగచంద్రుడు, మధుసూదన్, చంద్రశేఖర్, మురళీమోహన్, జమాల్‌రెడ్డి, పరమేశ్వర పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అభినందనీయం

బద్వేలు , నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అర్బన్ సీఐ రాజగోపాల్ తెలిపారు. ఆదివారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డీవైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, మస్తాన్ షరీఫ్, ఆదిల్, బాలగుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి

అట్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్ఐ రామక్రిష్ణ సూచించారు. ఆదివారం అట్లూరు క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల రికార్డులు, లైసెన్సు, హెల్మెట్ లేని 17 మందికి రూ.3095 జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల మెడపై ఎఫ్ఆర్ఎస్ కత్తి

పోరుమామిళ్ల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఉద్యోగుల మెడపై ఎఫ్ఆర్ఎస్ సిస్టం పెట్టడం బాధాకరమని రాష్ట్ర తెలుగునాడువైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పెట్టిన జీవోలను ఉద్యోగులపై రుద్దడం బాధాకరమన్నారు. ఫేసియల్ రికగ్నైజేషన్ సిస్టం కొన్ని డిపార్ట్‌మెంట్లలో తీసివేయడం జరిగిందని వైద్యఆరోగ్యశాఖలో ఉంచడం దారుణమన్నారు. అన్నారు.

యువతులకు సివిల్స్ ఉచిత శిక్షణ

● తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.కొండారెడ్డి



పులివెందుల ఆర్డీవో భానుశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని యువతుల ఉజ్వల భవిష్యత్తుకోసం సివిల్స్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలలో సివిల్స్‌లో ఉచిత శిక్షణకు ఎంపిక పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి డాక్టర్ లక్షుమయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇప్పిస్తామన్నారు. అనంతరం లక్షుమయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగం సాధించిన పులివెందుల ఆర్డీవో భానుశ్రీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్షుమయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఛైర్మన్ డాక్టర్ లక్షుమయ్య, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి కోటా ఓబుళరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

అట్లూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో కుంభగిరి, జి.కొత్తపల్లె గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఎం.మహేశ్వర్‌రెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య,జయక్రిష్ణారెడ్డి,రఘురామయ్య, రాజగోపాల్‌రెడ్డి, నారా యణరెడ్డి, క్రిష్ణారెడ్డి, గోపాలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద కంపచెట్లు తొలగింపు

మైలవరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలీసులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మైలవరం బస్టాండ్ చుట్టూ పెరిగిన కంపచెట్లను తొలగించి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేశారు. కార్తీకమాసంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అగస్త్యేశ్వరస్వామికి వచ్చే భక్తులు మైలవరం బస్టాండ్ వద్ద కంపచెట్లు పెరిగి ఇబ్బందులు పడకుండా ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తమ సిబ్బందితో ప్రొక్లెయిన్ ద్వారా దగ్గరుండి బస్టాండ్ ప్రాంతంతో పాటు ప్రజలకు అసౌకర్యంగా ఉన్న పలు చోట్ల కంపచెట్లను తొలగించి శుభ్రం చేయించారు.

గోపవరం..: మండలం బద్వేలు - నెల్లూరు రహదారిపై ఉన్న బస్టాండు వినియోగంలో లేకపోవడంతో చుట్టూ ముళ్లపొదలు పెరిగాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. బద్వేలు రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో గోపవరం ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో ముళ్లపొదలు తొలగించడంతో బస్టాండు ప్రాంగణం సుందరంగా తయారైంది.

సమాజ సేవతోనే మానవ జీవితానికి సార్ధకత

కాశినాయన నవంబరు (ఆంధ్రజ్యోతి)3: సమాజానికి సేవ చేయడంవల్లనే మానవ జీవితానికి సార్ధకత లభిస్తుందని తిరుపతి పట్టణానికి చెందిన సామాజిక సేవకురాలు జి.సుజాత పేర్కొన్నారు.మండల పరిధిలోని ఓబుళాపురం సమీపంలోగల వివేకానంద సేవాశ్రమంలో ప్రత్యేక గదులను ఆదివారం ఆమె ప్రారంభించారు. గదుల నిర్మాణానికి సహకరించిన దాతలకు వివేకానంద సేవాశ్రమ స్థాపకుడు రామక్రిష్ణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వీరస్వామి, విశ్రాంత సైనికుడు బాలుడు, శ్రావణి,గురుమూర్తి, షణ్ముఖమూర్తి,స్వాతిక, మూర్తిపాల్గొన్నారు.

చిన్నారిని చంపేసిన వ్యక్తిని ఉరితీయాలి

బద్వేలు , నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా వడమాల పేట, అబ్బికండ్రిక గ్రామంలో మూడేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన సుశాంత్‌ను ఉరితీయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు, పట్టణ కమిటీ అధ్యక్షుడు చాంద్‌బాష, సత్తార్ డి మాండ్ చేశారు. ఆదివారం ఆవాజ్ కార్యాలయంలో నిర్వహిం చిన సమావేశంలో వారు మాటాడారు. ఈకార్యక్రమంలో ఆవాజ్ నాయకులు మస్తాన్, రహీం, రసూల్, షబ్బీర్, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి (ఫాస్ట్ ట్రాక్ కోర్టు, బద్వేలు) వారి కోర్టులో

I.P.No.6/2023

కొప్పరపు వెంకట ప్రసాద్ S/o. గురవయ్య D.No.6-110,నాయనిపల్లె(V), ఎస్.ఏ. కాశినాయన (M),YSR కడపజిల్లా. **...Petitioner/Debtor**

Vs

R8:యంగాని చిన్న వెంకటసుబ్బయ్య S/o. మద్దిలేటి, D.No.1-95, ఆకుల నారాయణపల్లె (V), వరికుంట్ల (PO), ఎస్.ఏ. కాశి నాయన (M), YSR కడపజిల్లా. **...8వ రెస్పాండెంట్/Creditor**

నోటీసు

పై నెంబరు ఐ.పి. పిటీషన్‌లో పిటిషనరు/ Debtor రాజశ్రీ కోర్టులో Insolvency పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో 8వ రెస్పాండెంట్ అయిన మీకు ఏమైనా ఆక్షేపణ లున్న యెడల **14-11-2024వ తేది** ఉ. 10-30 ని.ల రాజశ్రీకోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షముగా పిటిషన్‌ను తీర్మానించబడును.

P.V.N. ప్రసాద్
పిటిషనర్ తరపున న్యాయవాది, బద్వేలు